క్లుప్తంగా

26న మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

రొంపిచెర్ల: ఈ నెల 26న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండల పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రొంపిచెర్ల మార్కెట్ కమిటీలో రూ.50 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులను మంత్రి ప్రారంభిస్తారని, అలాగే వాటర్ షెడ్ పథకంలో పైపులు, ప్లాస్టిక్ పట్టలు, యంత్ర సామగ్రిని పంపిణీ చేస్తారన్నారు. అనంతరం పెద్దగొట్టిగల్లులో సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.1.40 కోట్లతో నిర్మించిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారని, ఆ తర్వాత పెద్దగొట్టిగల్లు సమీపంలో ప్రైవేటు కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ చల్లా శ్రీనాథ్, విజయశేఖర్, సూర్య నారాయణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, నాగ రాజ, సుబ్రమణ్యం, ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, సీసీ రమణారెడ్డి, వెంకట నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కన్వీనర్



మంత్రి పెద్దిరెడ్డితో జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి

సదుం: మంత్రి పెద్దిరెడ్డిని జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తిరుపతిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిశారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జోగివారిపల్లెకు ఏపీ ఫైబర్‌నెట్ కనెక్టివిటీ కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉన్నత పాఠశాల తనిఖీ



పెద్ద ఉప్పరపల్లెలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్ రెడ్డి

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా ఏఎల్ఎస్ఓ అజయ్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ-2 శివరత్నమ్మ, హెచ్‌ఎం భాస్కర్, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. నాడు-నేడు రెండో విడత లో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు.

నాణ్యమైన విద్య బోధించాలి



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డీవైఈఓ

సోమల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధించాలని మదనపల్లె డీవైఈఓ కృష్ణప్ప ఆదేశించారు. గురువారం మండలంలోని కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, అటల్ టింకరింగ్ ల్యాబ్, పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 10 తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. ఆ తర్వాత ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, షకీల్, టీచర్లు పాల్గొన్నారు.

26న కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 26న కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. శంకర్ నేత్రాలయ సౌజన్యంతో ప్రతి నెలా ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, పట్టణ, మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9న జాతీయ లోక్ అదాలత్

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



పలమనేరు: పట్టణ సమీపంలోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు కోరారు. స్థానిక కోర్టులో గురువారం ఆయన పోలీసులు, న్యాయవాదులతో మాట్లాడారు. ఎలాంటి పెండింగ్ కేసులునైనా జాతీయ లోక్ అదాలత్‌తో రాజీ చేసుకునే వెసులుబాటు ఉందని, కక్షిదారులు పంతాలు, పట్టింపులకు పోకుండా కేసులను రాజీ చేసుకుని ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రీ-లిటిగేషన్, చెక్ బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు, కేసుల సత్వర పరిష్కారానికి ఇది మంచి వేదిక అన్నారు.



వి.కోట: జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ



రామకుప్పంలో..

జయహో భారత్



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న జెడ్పీ బాలికలు



పుంగనూరు: గూడూరుపల్లెలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, హెచ్‌ఎం

పుంగనూరు: భారత దేశ ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 విజయవంతం కావడంపై గురువారం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు, జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం రుద్రాణి, తెలుగు పండితుడు జీవీ.రమణ ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ చేశారు. అలాగే మండలంలోని గూడూరుపల్లె, బండ్లపల్లె హైస్కూళ్ల విద్యార్థులు ర్యాలీ చేశారు. జైహింద్...జైజై ఇండియా అంటూ జాతీయ పతాకాలు, అబ్దుల్ కలామ్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. బాణసంచాలు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఇస్రో శాస్త్రవేత్తల అవిరళ కృషికి దక్కిన ఫలితంతో యావత్ ప్రపంచం దృష్టి మరోసారి భారత్‌పై పడిందన్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో గూడూరుపల్లె హెచ్‌ఎం మహేష్ నారాయణ, హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, పరమేష్, హైస్కూల్ కమిటీ చైర్మన్ గోపి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): చంద్రయాన్-3 విజయవంతంతో భారతదేశ ప్రతిష్ట ప్రపంచ దేశాల్లో ఇనుమడించిందని హర్షం వ్యక్తం చేస్తూ గురువారం కల్లూరు హైస్కూలు విద్యార్థులు జాతీయ పతాకాలతో ప్రదర్శన చేశారు. రాకెట్, శాటిలైట్ నమూనాలను ప్రదర్శించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకట రమణారెడ్డి, వెంకట సిద్ధులు, రాజేంద్ర, వేణుగోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: చంద్రయాన్-3 మిషన్ విజయంపై కుప్పంలో సంబరాలు చేసుకున్నారు. ప్రముఖ విద్యా సంస్థ హాకింగ్ పాఠశాల విద్యార్థులు జాతీయ పతాకాన్ని చేతబట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ మాట్లాడుతూ, చంద్రుడి దక్షిణ ధృవంపై భారత్ మొట్టమొదట అడుగుపెట్టిన దేశం కావడం గర్వకారణమన్నారు. శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని, విజ్ఞాన రంగంలో రాణించి, దేశానికి సేవలు అందించాలని స్థానిక ప్రముఖ వైద్యులు సురేష్ మునిరత్నం విద్యార్థులకు పిలుపునిచ్చారు.

రామకుప్పంలో..

రామకుప్పం: చంద్రయాన్-3 విజయవంతం కావడంపై స్థానిక బాలికల హైస్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ చేశారు. భారత్ మాతాకీ జై..జయహో ఇస్రో అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: జయహో భారత్ ... జయహో భారత్ నినాదాలు గురువారం వీ.కోటలో మిన్నంటాయి. చంద్రుడిపై భారత్ చేపట్టిన చంద్రయాన్ -3 ప్రయోగం విజయవంతం కావడంతో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా రాగశ్రీ పాఠశాల విద్యార్థులు సైనికుల వేషధారణలో జాతీయ జెండాలను చేత పట్టుకుని జయహో భారత్...జయహో భారత్ అంటూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రపంచదేశాలకు భారత్ స్ఫూర్తిగా నిలిచిందంటూ ఉప్పొంగి పోయారు.



కుప్పం : ర్యాలీ నిర్వహిస్తున్న హాకింగ్ విద్యార్థులు



పులిచెర్ల : కల్లూరు హైస్కూల్లో..

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రామకుప్పం: ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, బాలమురుగన్

రామకుప్పం: మండలంలో రాజుపేటలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అప్పయప్ప రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ రూ.10వేల ఆర్థిక సాయాన్ని జెడ్పీటీసీ నితిన్ రెడ్డి ద్వారా గురువారం మృతుని భార్యకు అందజేశారు. అప్పయప్ప కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలమ్మ, వైస్ సర్పంచ్ ఆంజనేయులు, స్థానిక నేతలు బాలమురుగన్, అజయ్ రెడ్డి, నారాయణస్వామి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్దాం కుటుంబానికి రూ.1.2లక్షల సాయం

పలమనేరు:నాలుగురోజుల క్రితం పట్టణంలోని రంగబాబు సర్కిల్‌లో లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన చికెన్ దుకాణదారుడు సద్దాం కుటుంబానికి పట్టణానికి చెందిన చికెన్ వ్యాపారులు అండగా నిలిచారు. వారంతా కలసి 1,20,000 రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రజల ముంగిటకే వైద్యసేవలు



అంగన్‌వాడీ పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ జానకీరావు

పులిచెర్ల(కల్లూరు): ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నట్టు కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికలాఫీసర్ డాక్టర్ జానకిరావు అన్నారు. గురువారం మండలంలోని వెంకటదాసరపల్లె పంచాయతీ చెరకువారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ,గ్రామంలో నడవలేని స్థితిలో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి పరీక్షించారు. మందులు అందజేశారు. ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

వీ.కోట సీఐగా లింగప్ప



వీ.కోట: వీ.కోట సీఐగా లింగప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఆశీర్వాదం బదిలీపై వెళ్లడంతో రాయచోటి నుంచి లింగప్ప ఆయన స్థానంలో నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన వీ.కోట మండలంలో అంతర్రాష్ట ముఠాలను అరికట్టడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

నేడు గడప గడపకు..

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు తెలిపారు.

రాయితీపై రైతులకు ఉలవలు పంపిణీ



సోమల : ఉలవలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య



సదుం: ఉలవలు పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి



రొంపిచెర్ల : ఉలవలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



వి.కోటలో..



బైరెడ్డిపల్లెలో..

సోమల: స్థానిక సచివాలయం-1 వద్ద రైతులకు రాయితీపై గురువారం ఎంపీపీ ఈశ్వరయ్య, ప్రజా ప్రతినిధులుఉలవ విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపీపీతోపాటు వ్యవసాయాధికారి సుధాకర్ మాట్లాడారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వేరుశనగ సాగు తగ్గిందని, రైతులు ఉలవలు సాగు చేయాలని కోరారు. మండలానికి 139 క్వింటాళ్ల ఉలవ విత్తనాలు వచ్చాయని, వీటిని 13 రైతు భరోసా కేంద్రాలలో అందుబాటు ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీడీఓ నాగరాజ, ఇరికిపెంట సర్పంచ్ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు శ్రీరాములు, శీలం గణేష్ పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండల కేంద్రంలో రాయితీ ఉలవల పంపిణీని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. వ్యవసాయాధికారి హరిప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రైతులకు సబ్సిడీపై ఉలవ విత్తనాలను గురువారం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి పంపిణీ చేశారు. మండలానికి137 క్వింటాళ్ల సబ్సిడీ ఉలవలు వచ్చాయని, వీటిని 80 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్టు చెప్పారు. మార్కెట్‌లో కిలో రూ.108 ధర ఉండగా ప్రభుత్వం కిలో విత్తనాలను రూ.21.60 లకు ఇస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, మండల వ్యవసాయాధికారి సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు విజయశేఖర్, డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, కరీముల్లా, సూర్యనారాయణ రెడ్డి, శ్రీనాథనాయుడు, రామనారాయణ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది వెంకటరమణ నాయక్, రేఖ, సుజాత, నర్మద తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ రైతు భరోసా కేంద్ర వద్ద గురువారం రైతులకు రాయితీపై ఉలవ విత్తనాలను ఎంపీపీ యువరాజు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో వేరుశనగ సాగు విస్తీర్ణం 2,851 హెక్టార్లు ఉండగా అందులో 356 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారని, సాగు చేయని వారు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమీమ్‌ఖాన్, రెస్కో డైరెక్టర్ భూపతి, వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

18 ఆర్బీకేలకు 94 క్వింటాళ్ల ఉలవలు

గుడుపల్లె: రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు 80 శాతం రాయితీతో ఉలవ విత్తనాలు రైతులకు ఇవ్వనున్నట్టు వ్యవసాయశాఖ అధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాలకు మొత్తం 94 క్వింటాళ్ల ఉలవ విత్తనాలు వచ్చినట్లు చెప్పారు.రాయితీ పోను 10 కిలోల ఉలవ విత్తనాలు రూ. 216కు ఇస్తామని, కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జెరాక్సులను ఇచ్చి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప రాయితీపై ఉలవలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, వ్యవసాయశాఖ అధికారిణి గీతారాణి, సర్పంచులు వెంకటేష, బాలక్రిష్ణగౌడు, వైస్ సర్పంచ్ తబ్రాజ్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

బంగారు రుణాల మంజూరులో భేష్



మంత్రి గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ హరినాథరెడ్డి

- జిల్లాలో రొంపిచెర్ల సహకార సంఘానికి మూడో స్థానం

రొంపిచెర్ల: బంగారు రుణాల మంజూరులో రొంపిచెర్ల సహకార సంఘం జిల్లాలో మూడవ స్థానంలో నిలిచిందని డీసీసీబీ డైరెక్టర్ దేవులపల్లె హరినాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సహకార సంఘంలో రూ.15 కోట్ల వరకు బంగారు రుణాలు, రూ.1.50 కోట్ల పంట రుణాలను ఇచ్చామన్నారు. దీనికి గుర్తింపుగా ప్రభుత్వం అవార్డును ప్రదానం చేసిందన్నారు. ఇటీవలే సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతుల దీనిని అందుకున్నట్టు చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో రొంపిచెర్ల సహకార సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని, సహకార సంఘం ఆధ్వర్యంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సహకార సంఘం కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు



మామిడి తోటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



పలమనేరు : మాట్లాడుతున్న సైంటిస్ట్ రెడ్డిరామ్

సదుం: వ్యవసాయ అధికారుల, నిపుణుల సూచనలు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. మామిడి కోతల అనంతరం తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు ఉద్యానవన శాఖ అవగాహన సదస్సు ఏర్పాటు చేసింది. కోతలు ముగిసి 20 రోజుల తరువాత అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మ లను కత్తిరించాలని శాస్త్రవేత్తలు డాక్టరు రెడ్డి రాము, రాఘవేంద్ర సూచించారు. కత్తిరించిన కొమ్మకు 10 గ్రాముల సీఓసీని లీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని పూయాలన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఒక రైతు మామిడి తోటలో రైతులకు ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, హార్టికల్చర్ అధికారిణి సంతోషికుమారి, వ్యవసాయాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మామిడి తోటల్లో కోతల అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై గురువారం మండలంలోని ఫకీర్‌పల్లెలో జిల్లా ఉద్యానశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మామిడి రైతులకు అవగాహన కల్పించారు. మరో రెండు వారాల్లో మామిడి చెట్ల కొమ్మల కత్తిరింపులు చేయాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులకుగాను మామిడి తోటల్లో జనుము, జీనుగ మొదలైన సాగుచేసి ఆపై తోటలో కలియదున్నాలని, తోటలో సాలుకు అడ్డంగా రెండు సార్లు దున్నితే సరిపోతుందన్నారు. రైతుల సందేహాలను డాట్ సెంటర్ సైంటిస్ట్ రెడ్డి రామ్ నివృత్తి చేశారు. స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మీప్రసూన, హార్టికల్చర్ అసిస్టెంట్లు, మామిడి రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి

చౌడేపల్లె: ప్రభుత్వంఅంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి అన్నారు. గురువారం చౌడేపల్లెలో మండలంలోని 66 సెంటర్ల అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీఓ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు, బాలింతలు రక్తహీనత సమస్యను అధికగమించడానికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం పొందాలన్నారు. 3కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర్ధలీటర్ నూనె, 2.5లీటర్ల పాలు, 13 కోడి గుడ్లు, రాగిపిండి2 కేజీ, ఎండు ఖర్జూరం 250 గ్రాములు, వేరుశనగ చిక్కీలు250 గ్రాములు, బెల్లం 250గ్రాములు, జొన్నపిండి కేజీ చొప్పున టేక్ హోమ్ రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు. వీటిని ప్రతినెలా క్రమం తప్పకుండా 15వ తేదీ లోపు అర్హత ఉన్న వారికే అందజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సిబ్బంది సమష్టికృషి చేయాలన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై దృష్టి సారించి మాతా-శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అనంతరం కేంద్రాల వారీగా నివేదికలపై సమీక్షించి వివరాలు సేకరించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సులోచన, రమాదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు సోలార్ లైట్లు



సోలార్ లైట్లను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె : తోపుడు బండ్ల వ్యాపారులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఉచితంగా సోలార్ లైట్లను అందజేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలానికి కేటాయించిన సోలార్ లైట్లను 50 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాత్రి సమయాల్లో వ్యాపారులకు ఈ లైట్లు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. మంత్రి, ఎంపీ మిథున్‌రెడ్డికి వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు సుదాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చెర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, ఎంపీడీఓ సుధాకర్, ఈఓ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్డు పనులు ప్రారంభం



డిగ్రీ కళాశాల వద్ద జేసీబీతో చేస్తున్న లింకు రోడ్డు పనులు

పుంగనూరు: పట్టణంలోని డిగ్రీ కళాశాల వెనుక నుంచి రామసముద్రం రోడ్డుకు లింకు రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణంతో కలసి భూములను పరిశీలించి, రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే ముళబాగల్ రోడ్డు, శనేశ్వరుని గుడి వద్ద, మున్సిపల్ కంపోస్ట్ యార్డు పనులను పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. పట్టణ విస్తరణ ప్రాంతాలలో కాలువలు నిర్మిస్తామని, రోడ్లు, వీధులు వేస్తామని, అలాగే విద్యుత్ లైన్లు, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణం నుంచి జగనన్న కాలనీలకు అనుసంధానంగా రోడ్లు వేస్తామన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగేంద్ర, కౌన్సిలర్ కొండవీటి నటరాజ, డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, సర్వేయర్ కిరణ్మయి, నాయకులు రాజేష్, సురేష్, కొండవీటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ డీటీఎఫ్ అధికారులు

పలమనేరు: కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీటీఎఫ్ ఎస్ఐ మాధవస్వామి గురువారం తెలిపారు. ఆయన కథనం..కీల పట్ల క్రాస్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కాపు కాశారు. అక్కడ గంగవరం మండలం బొమ్మనపల్లెకు చెందిన గుర్రప్ప(65), కీలపట్లకు చెందిన బెస్త కార్తీక్(30)లను అరెస్ట్ చేసి, వారి నుంచి 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం తిప్పిదొడ్డి నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి స్థానికంగా అధి క ధరలకు వీరు విక్రయిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ దాడుల్లో ఎస్ఐ మస్తాన్‌వలి, సిబ్బంది గౌతమ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.